

కలుషిత ఆహారం తిని

121 మంది విద్యార్థులకు అస్వస్థత

- బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటాం : మంత్రి
- పరిస్థితి సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు
- విద్యార్థులను పరామర్శించిన సిపిఎం నాయకులు





గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్ - ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి

ప్రజాశక్తి- నాయుడుపేట, గూడూరు టౌన్: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం 121 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి చేసిన పూరీలను విద్యార్థులకు ఆదివారం ఉదయం పెట్టారు, మధ్యాహ్నం చికెన్ పెట్టారు. దీంతో 121 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలై అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థుల ఆరోగ్యపరిస్థితులను తెలుసుకున్నారు. పిల్లల తల్లిదండ్రులతో చర్చించి విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగదని భరోసా ఇచ్చారు. నాయుడుపేట కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అక్కడే ఉండి పరిస్థితి సమీక్షిస్తున్నారు.



విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి

గూడూరు టౌన్: గూడూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న 30 మంది విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందన్న డాక్టర్లు తెలుపగా విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం అందించాలని వైద్యులకు సూచించారు. మంత్రితోపాటు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు విజయశ్రీ, పాశిం సునీల్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ ఈ సంఘటనకు సంబంధించి జాయింట్ కలెక్టర్‌తో కమిటీ వేస్తున్నామని, విచారణ జరిపించి నివేదిక ఆధారంగా దీనికి కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాల్లో మెరుగైన వసతులు ఏర్పాటు చేస్తామని ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అస్వస్థతకు గురైన విద్యార్థులను నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరులో చికిత్స అందిస్తున్నామని పాఠశాలలో కొన్ని సమస్యలు గుర్తించామని వాటిని త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఇటీవల పలు గురుకుల పాఠశాలలో అనేక సంఘటనలు జరిగాయని విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి: ఎస్ఎఫ్ఐ

క్యాంపస్: నాయుడుపేటలోని గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ఇది ముమ్మాటికీ జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, అధ్యక్షులు అక్బర్ విమర్శించారు. జూన్ నెల విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా తిరుపతి జిల్లా జేసీకి హాస్టల్ సమస్యలపై, గురుకుల సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యలను కాపాడాలని, సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చినట్లు వివరించారు. కానీ అధికారులు పైపైన చర్యలు తప్ప సమగ్రంగా సమస్యల పరిష్కారించేలా చర్యలు చూపకపోవడం వల్లే గురుకుల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. డక్కిలిలో డెంగీతో విద్యార్థి మృతి, నాయుడుపేటో 121 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురై పరిస్థితి విషమించే వరకూ అధికారులు కదిలే పరిస్థితి లేదన్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం కదిలి పేద విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్, ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు కోరారు. గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరామర్శించి, జరిగిన ఘటనపై ఆరా తీశారు. గురుకుల పాఠశాలల్లో తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయని సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, దీనికి కారణమైన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. వారి వెంట నాయకులు జోగి శివకుమార్, సురేష్, శ్రీనివాసులు, ప్రసాద్ ఉన్నారు.



గూడూరులో విద్యార్థులను పరామర్శిస్తున్న వందవాసి నాగరాజు

చోరీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..

ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- పూతలపట్టు: చిత్తూరు జిల్లాలో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక నిఘా పెట్టామని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. సోమవారం పూతలపట్టు పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి, అన్నమయ్య జిల్లా పరిధిలో చోరీకి గురైన 50 ద్విచక్ర వాహనాలను పూతలపట్టు పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేశారు. నిందితున్ని అరెస్టు చూపడంలో భాగంగా విచ్చేసిన ఎస్పి నిందితున్ని పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గత నెల 14న రంగంపేట క్రాస్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సందీప్ (24) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చిన పోలీసులు నిందితున్ని పట్టుకొని విచారించగా అసలు విషయం బయటపడిందని చెప్పారు. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను భాకరాపేట అటవీ ప్రాంతంలో ఉన్నట్టు నిందితుడు చెప్పడంతో పోలీసులు సుమారు రూ.45లక్షల విలువ గల 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు. నిందితులపై ఇదివరకే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 30కి పైగా కేసులు ఉండడంతో అన్ని కేసుల విషయాలను కోడిరికరించి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట డిఎస్పి రాజగోపాల్ రెడ్డి సిఐ సుదర్శన ప్రసాద్ తదితరులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సమిష్టిగా పనిచేద్దామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలిసి సంబంధిత శాఖలతో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 379 రోడ్డు ప్రమాదాలలో 170 మంది దాకా చనిపోయారని, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జిల్లాలోని సంబంధిత శాఖలన్ని సమిష్టిగా పనిచేయాలన్నారు. జాతీయ రహదారులలో ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను జిల్లాలో 26గా గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిహెచ్‌సిలలో ప్రమాదాలలో క్షతగాత్రులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు అవసరమైన బ్లడ్‌ను అందుబాటులో ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనితోపాటు రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి దేవిని ఆదేశించారు. సిహెచ్సీలలో ఏరియా ఆసుపత్రులలోను, చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో క్షతగాత్రుల కోసం అవసరమైన పడకలు కేటాయించాలని వారికి అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచుకోవాలని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్‌ను ఆదేశించారు. ప్రమాదాలలో మరణించిన వారికి సంబంధించిన ధ్రువపత్రాలు, క్లెయిమ్‌ల పరిష్కారంలో ఆర్డీఓలు, తహశీల్దార్లు సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో జిల్లా యంత్రాంగంకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల మీద ఉన్న ప్రేమతో వాహనాలను ఇవ్వడం ద్వారా అతివేగం వల్ల జరిగిన ప్రమాదాల్లో ఆ పిల్లల ప్రాణాలను బలి తీసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయని, వీటిని గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ అరిపుల్లా, డిటిసి నిరంజన్ రెడ్డి, ఎన్‌హెచ్‌పిడి కార్తీక్ రెడ్డి, పిఆర్, ఆర్ అండ్ బి ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్ రెడ్డి, డిపిఓ లక్ష్మి పాల్గొన్నారు.

చల్ల..చల్లని.. కూల్.. కూల్..!

- అంతటా చల్లని గాలులు..
- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు
- ద్రోని ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షాలు



ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలు చల్లని శీతల పానీయాలు తాగినట్టు చల్లచల్లని కూల్ కూల్ అనుభూతిని పొందుతున్నారు. ఆరు నెలల పాటు ఉక్కపోతతో అతలాకుతలమైన ప్రజానీకం ఇప్పుడే చల్లని గాలులతో ఉపశమనం పొందుతున్నారు. అప్పుడే చలికాలం వచ్చేసిందా అన్న భావన కనిపిస్తోంది. చిరుజల్లులతో ప్రజలు ఇండ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి- పూతలపట్టు: సాధారణంగా జూన్ నెల వచ్చిందంటే వర్షాలు ప్రారంభమయ్యే పరిస్థితులు గతంలో ఉండేవి మారుతున్న వాతావరణంతో జూలై వరకు ఈ పరిస్థితి లేదు. అయితే తాజాగా వర్షాలు పడుతున్నాడంతో జనం అందరిలోనూ వర్షాకాలం వచ్చేసినట్టే అనే భావన కనిపిస్తోంది. సోమవారం జిల్లాలో పలుచోట్ల మోస్తారు వర్షాలు అంతటా చల్లని గాలుల ప్రభావం కనిపించింది. చిరు జల్లులతో చల్లని గాలులు వీస్తున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో వర్షాలు పడిన ప్రదేశాలు మొత్తం కూల్‌కూల్ కావడంతో ఎండల నుంచి ఒక్కసారిగా ఉపశమనం పొంది చల్లని వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ మాసంలో పడాల్సిన వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదు కావడం శుభసూచికం. పూతలపట్టు మండలంలో జూన్ మాసంలో 77.2ఎంఎం సాధారణ వర్షపాతం నమోదు కావాల్సింది ఉండగా 203.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

చల్లని గాలులతో అప్రమత్తంగా ఉండాలి

చల్లని గాలులతో ప్రజలు కూల్‌కూల్‌గా ఉండడమే కాకుండా అప్రమత్తంగా కూడా ఉండాలని వైద్య అధికారులు సూచిస్తున్నారు. చల్లని గాలులతో గృహపరిసర ప్రాంతాలలో ఉన్న నీటి నిలువవలతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. జ్వరం వచ్చిన వెంటనే తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ముసురు వర్షం

చిత్తూరుఅర్బన్: అల్పపీడన ద్రోని ప్రభావంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సోమవారం మోస్తారు వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లాలోని 26 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. సోమల, ఎస్ఆర్ పురం, బైరెడ్డిపల్లి, వీకోట, శాంతిపురం, గుడిపల్లి, కుప్పం, రామకుప్పం, బంగారుపాళ్యం మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో అత్యధికంగా నింద్ర మండలంలో 8.2, పెనుమూరు 0.5, చౌడేపల్లి 4.2, రొంపిచర్ల 3.2, గుడిపాల 0.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

చిత్తూరు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

అభినందన సభలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తనపై నమ్మకం ఉంచి, అత్యంత మెజారిటీతో గెలిపించిన చిత్తూరు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఎంపి ప్రసాదరావును ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులు హైదరాబాదులో ఘనంగా సత్కరించారు. చిత్తూరు ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొంది, చట్టసభల్లో అడుగుపెట్టిన అభినందించారు. ఐఆర్ఎస్ అధికారిగా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి, ఆ పదవికే వన్నె తెచ్చి, క్రమశిక్షణకు నీతినిజాయితీకి మారుపేరుగా నిలిచిన ప్రసాదరావు ఆధునిక సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరిన్ని పదవులను అలంకరించాలని వారి ఆకాంక్షించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ ప్రజల ఆశయానికి అనుగుణంగా, నిస్వార్థంగా సేవలందించినప్పుడే ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేయగలమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తనకు స్ఫూర్తి ప్రదాత అని, ఆ మహనీయుని అడుగుజాడల్లో నడిచి ప్రజలకు సేవ చేయాలన్నదే తన జీవిత సంకల్పం అన్నారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు..

పరిష్కారమే ప్రధానం: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్)లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని నూతన భవనం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్)లో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్, పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లతో జిల్లాలోని నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని అర్జీదారుల సమస్య గురించి క్షుణ్ణంగా తెలుసుకొని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడడంతో పాటు అర్జీదారుని ద్వారా మాట్లాడించి పరిష్కారానికి చర్యలు తీసుకొనేలా చర్యలు చేపడుతున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంకు జిల్లాస్థాయిలో నియోజకవర్గ, మండలస్థాయిలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో విధిగా అధికారులు వారివారి పరిధిలో హాజరవ్వాలన్నారు. కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ప్రతివారం సమీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి.. పరిష్కారమే ప్రధానంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 101 అర్జీలు రాగా శాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 94, పోలీస్ శాఖ 1, జిల్లా పౌరసరఫరాలు 1, విద్యుత్తు శాఖ 1, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ 1, జిల్లా రిజిస్టర్ శాఖ 1, డిఎంహెచ్‌ఓ (వైద్యశాఖ) 1, సర్వశిక్ష అభియాన్ 1, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, డ్వామా పిడిలకు అందజేశారు.

అలసత్వం చేయకండి: ఎస్పీ



ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్లా, దిశా డిఎస్పీ సుధాకర్‌రెడ్డిలను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈఫిర్యాదులకు స్పందిస్తూ త్వరిత గతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు అందగా కుటుంబ తగాదాలు 3, వేధింపులు 4, డబ్బు తగాదాలు 9, భూ తగాదాలు 16, ఆస్తి తగాదాలు 5 ఉన్నాయి.

వేగంగా వినతుల పరిష్కారం: కమిషనర్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినుతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. గతవారం అందిన వినతులపై సమీక్షించారు. సోమవారం రెవెన్యూ 2, మెప్మా 2, ఇంజనీరింగ్ 3, పబ్లిక్ హెల్త్ 2 చొప్పున మొత్తం 8 వినతులు అందాయి. ఈకార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుల స్వీకరిస్తున్న నగర కమిషనర్ అరుణ

అక్రమంగా ఇసుక తరలిస్తున్న

ట్రాక్టర్లను అడ్డుకున్న యువకులు



ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం వద్ద కుశస్థలి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తెరణి గ్రామానికి చెందిన యువకులు పట్టుకున్నారు. తెరణి దళితవాడకు సంబంధించిన శ్మశానానికి వెళ్ళే దారిలో ఇసుకను పూర్తిగా తవ్వేసి లోడ్ చేసుకుంటున్న రెండు ట్రాక్టర్లను స్థానిక దళితవాడకు సంబంధించిన యువకులు అడ్డుకున్నారు. ప్రభుత్వం స్టాక్ పాయింట్ నిర్దేశించని ప్రాంతాల్లో ఇసుకను ఎలా తరలిస్తారంటూ వారిని ప్రశ్నించారు. వెంటనే తహసీల్దార్‌కు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి తహసీల్దార్ వీఆర్వోను పంపడంతో యువకులు రెండు ట్రాక్టర్లను వీఆర్వోకు అప్పగించారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని యువకులు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. మరోమారు ఇసుక తరలింపు కొనసాగితే రోడ్లమీదకు వచ్చి పోరాడుతామంటూ హెచ్చరించారు.

లెప్రోసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: లెప్రోసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌కు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖకు సంబంధించిన ఎల్‌సిడిసి (లెప్రోసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమం గోడపత్రికలను, బ్యానర్‌ను లాంచనంగా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 18వ తారీఖు నుంచి ఆగస్టు 2వ తారీఖు వరకు జిల్లాలోని అన్ని గ్రామాలలో ఆశాల ద్వారా కొత్త లెప్రోసి కేసుల ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 3080 బృందాల ద్వారా సర్వే, 603 బృందాల ద్వారా మానిటర్ చేస్తూ, జిల్లాలోని 64 పిహెచ్‌ల పరిధిలో అర్బన్ హెల్త్‌సెంటర్ల పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి దేవి, జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

ప్రజాశక్తి - పుంగనూరు: పుంగనూరుకు చెందిన సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్ మొదలియార్(50) సోమవారం వేకువ జామున ఆకస్మికంగా మృతి చెందారు. పుంగనూరు, రామసముద్రం మండలాలలో సుమారు 30సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో పని చేశారు. ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రప్రభ, సూర్య దినపత్రికలలోనూ, ఆశాజ్యోతి, అస్త్రం సాయంకాలపు పత్రికల్లో జర్నలిస్టుగా కొనసాగారు. సోమవారం ఉదయం శ్వాస తీసుకోవడంలో సమస్యగా ఉందని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. జిల్లా జర్నలిస్ట్ సంఘం యూనియన్ పలు పదవులలో కీలకంగా ఉన్నాడు. ఈయన మృతి పుంగనూరు జర్నలిస్టుకు తీరనిలోటని ఆ సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నిజాయితీ నిబద్ధతుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగారు. ఈయన మృతి వార్త తెలియగానే పట్టణంలో పలువురు ప్రముఖులు, సీనియర్ పాత్రికేయులు శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాత్రికేయ వృత్తిలో చాలా కాలం నుంచి పనిచేస్తున్న శ్రీనివాస మొదలియార్ ఆకస్మిక మరణం తీరని లోటని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్ బాషా అన్నారు.

జలకంఠేశ్వరుని సేవలో ఎమ్మెల్యేలు


స్వామివారి సేవలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని దేవరకొండలో గల జలకంఠేశ్వర స్వామిని సోమవారం పలమనేరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, కలికిరి మురళీమోహన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక కేంద్రాలుగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తుందన్నారు. గత మూడు రోజులకు మునుపు పర్యాటక శాఖ మంత్రిని కలిసి మొగిలి దేవరకొండ అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించామని, ఆ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయప్రకాశ్ నాయుడు, సుచిత్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాల పంజా

- అప్రమత్తమైన అధికారులు
- ఇంటింటా సర్వేలో వైద్య సిబ్బంది
- ప్రజాశక్తి వార్తకు స్పందన


ఇంటింటి సర్వే చేపడుతున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మారిన వాతావరణ పరిస్థితులు, వర్షాలతో విషజ్వరాలు పల్లెల్లో పంజా విసురుతున్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు జలుపు, జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బేలపల్లి పంచాయతీ ఆకుల కొత్తూరు గ్రామంలో ప్రజలు విషజ్వరాల బారిన పడ్డారు. ఈ విషయంగా సోమవారం ప్రజాశక్తిలో 'మంచాన పడ్డ ఊరు..' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన అధికారులు సోమవారం ఉదయం ఆకుల కొత్తూరుకు చేరుకొని పారిశుద్ధ్య పనులు చేపట్టారు. విషజ్వరాలపై ఇంటింట సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది పలువురికి పరీక్షలు చేసి మందులు, మాత్రలు అందజేశారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తీసుకోవాల్సి జాగ్రత్తలుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎంపీడీవో బాలాజీ స్పందిస్తూ.. తక్షణమే ఆ గ్రామంలో తాగునీటి ట్యాంకు శుభ్రం చేయించాలని, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించి పరిస్థితి కుదుటపడేంత వరకు పరిశీలనలో ఉంటామని వైద్యాధికారులు తెలిపారు.

గ్యాంగ్ రేప్ నిందితులను అరెస్ట్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వాల్మీకి సంఘ నేతలు

ప్రజాశక్తి-పుంగనూరు: 8 సంవత్సరాల చిన్నారి వాసంతిని గ్యాంగ్ రేప్ చేసి పైశాచిక ఆనందంతో హత్య చేసి మృతదేహాన్ని మాయం చేసి స్వేచ్ఛగా తిరుగుతున్న వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరా సర్కిల్ వాల్మీకి విగ్రహం ముందు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిద్యాల మండలం మచ్చుమర్రి గ్రామంలో చిన్నారిపై గ్యాంగ్ రేప్, హత్య చేసిన సంఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. పెద్దలు స్టేజిలెక్కి మైకులు పగిలేలా ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, మహిళా సాధికారతతోనే భరతమాత రుణాన్ని తీర్చు కుంటామని అంటుంటారు. అలా మాట్లాడే నాయకులు నేడు ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన వాల్మీకి వాసంతి అత్యంత కిరాతకంగా గ్యాంగ్ రేప్ చేయబడి హత్యకు గురైన ఐదు రోజులు అవుతున్న ప్రభుత్వానికి వినపడలేదా.. కనపడలేదా అని ప్రశ్నించారు. కానీ ప్రజాస్వామ్యంలో జరిగే అన్యాయాన్ని ప్రశ్నిస్తూ బాధ్యత కుటుంబాలకు న్యాయం చేయడానికి ప్రజల పక్షాన గలాన్ని విప్పి ప్రశ్నించడానికి రాష్ట్రవాల్మీకి సంఘం ఉంది అన్నారు. విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు మాట్లాడుతూ చిన్నారి వాసంతికి జరిగిన అన్యాయానికి ప్రభుత్వంతరపున సహాయ సహకారాలు అందించే వరకు పోరాటం చేస్తామన్నారు. నాయకులు నాగరాజు, జయసింహ, మంజునాథ్, శంకరప్ప, బాబురావు, వెంకటాద్రి, విశ్వనాథ్, రెడ్డప్ప, మనోహర, నరసింహులు, సుధాకర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆర్కేఎస్సార్ విద్యార్థి ఎంపిక


ట్రిపుల్ ఐటికి ఎంపికైన చైతన్య

ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో కార్వేటినగరం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నపాఠశాల విద్యార్థి పి.చైతన్న ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్ కుమార్లు తెలిపారు. సోమవారం ట్రిపుల్ ఐటీకీ ఎంపికైన విద్యార్థి చైతన్యను ఎంఈవోలు, పాఠశాల హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ క్రిస్టల్ ఐటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఆర్కేఎస్సార్ పాఠశాలకు ఆణిముత్యంగా నిలిచారని తెలిపారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ చైతన్యను ఆదర్శంగా తీసుకుని కడప జిల్లాలోని ఇడుపులపాయలో ఉన్నత విద్యకు బాటలు చేస్తున్న క్రిముల్ ఐటి పరీక్షా ఫలితాల్లో ఉన్నత మార్కులు సాధించి ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో భాగంగా చైతన్య దంప్రులను ఉపాధ్యాయు బృందం, హెచ్ఎం కోరేశ్వరరావులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవం



ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కుప్పం పట్టణంలోని 12వ వార్డు పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరన్ హాజరయ్యారు. ఇందులో భాగంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం భాస్కరన్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమిస్తూ, పరిరక్షిస్తూ, ప్రకృతితో కలిసి జీవనం సాగిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ మాధవన్, గంగాధరన్, పాఠశాల హెచ్ఎం గురుప్రసాద్ నాయుడు, పిఆర్ఓ ప్రవీణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు శివాచారి, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుంటా..

- పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిటీ విద్యను అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ అన్నారు. సోమవారం యాదమరి మండలం, కాశిరాల గొల్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. ముందుగా ఎమ్మెల్యేకి నాయకులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం అందించారు. ఎన్‌సిసి విద్యార్థులు గౌరవ వందనం చేశారు. అనంతరం పాఠశాల ప్రయోగశాలకు అవసరం అయ్యే వస్తువులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందజేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడం కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు కలిసి రావాలని ఎమ్మెల్యే మురళిమోహన్ కోరారు. చదువు ఒక వ్యక్తి యొక్క సంపూర్ణ వ్యక్తిత్వ, వికాసానికి ఉపయోగపడే సాధనమని నిరూపిస్తున్న ప్రయోగశాలు ప్రభుత్వ పాఠశాలలన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి అకుంఠిత దీక్షతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలు తీర్చే విషయంలో ప్రజాప్రతినిధిగా తాను ఎప్పుడూ ముందు ఉంటానని ఎమ్మెల్యే మురళిమోహన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రగిరి అభివృద్ధికి సహకరించండి

మోహన్ బాబుకి ఎమ్మెల్యే వినతి


ఎమ్మెల్యే పులివర్తి నానిని అభినందిస్తున్న మోహన్‌బాబు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మోహన్ బాబు విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం మోహన్ బాబుని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. మండలంలోని, ఏ రంగం పేట సమీపంలోని ఎంబియు వ్యవస్థాపకులు, ప్రముఖ సినిమా హీరో మంచు మోహన్ బాబుని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. మోహన్ బాబు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నాని విద్యానికేతన్ లోని మోహన్ బాబు నివాసంలో కలిశారు. మోహన్ బాబు ఎమ్మెల్యే నానికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. ఒకరి నొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొంత సమయం పిచ్చపాటి మాట్లాడుకున్నారు. ఇద్దరూ కలిసి అల్పాహారం స్వీకరించారు. ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని ఎమ్మెల్యేగా గెలవడం ఎంతో సంతోషకరమని మోహన్ బాబు అన్నా రు. సామాజిక సేవలో తాను ఎప్పుడూ ముం దు ఉంటానని చంద్రగి రి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మోహన్ బాబు ఎమ్మెల్యే నానికి మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముడిపల్లి సురేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరావు, ఏజిపల్లి బాల, గౌస్ బాష బెల్లంకొండ రమేష్, కే దేవిలాల్ , కే భూపతి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రెస్కో ఎండిగా సోమశేఖర్



ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని రెస్కో నూతన ఎండిగా సోమవారం సోమశేఖర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఏపి ఎస్‌పిడిసిఎల్ తిరుపతిలో ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఆయన కుప్పం రెస్కో ఎండీగా పదవి బాధ్యతలు స్వీకరించారు.

ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు రాణించాలి: ఎమ్మెల్సీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి-శాంతిపురం: విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించి జీవితంలో అనుకున్న లక్ష్యాలు పట్టుదలతో సాధించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ మంచి విద్యావంతులుగా ఎదగాలని తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, మంచి మానవతా దృక్పథంతో ఉండాలని చేతనైనంత వరకు ఇతరులకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వనాథ్ నాయుడు, నాగరాజు, జనార్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, ఆర్ఎస్ మణి, నారాయణరెడ్డి, రమేష్, చలపతి, నాగరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బలి బండి కూడు ఉత్సవం


బలిబండి ఉత్సవం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం బలి బండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బక్కాసురునికి బండి కూడు తీసుకువెళ్లి, బక్కాసురుని భీముడు సంహరించే ఘట్టాన్ని హరికథా నాట్యమయూరి రెడ్డెమ్మ భాగవతారిణి భక్తులకు కనులకు కట్టినట్లుగా కథ కాలాక్షేపం చేయడం జరిగింది. దీంతో సాయంత్రం భీముని వేషదారుడు ఎడ్ల బండిపై బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో భారత మిట్ట జన సంద్రంగా మారింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుని పోకల సోమనాథ్, ఆలయ కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, క్రిష్ణయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కళ్యాణోత్సవం

వార్షిక మహా భారతోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళ వారం ద్రౌపదీ ధర్మరాజుల వారికి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పోకల సోమనాధ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణాన్ని వీక్షించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విలీనం చేసిన పాఠశాలను మళ్లీ కొనసాగించాలి



ప్రజాశక్తి-విజయపురం(నగరి): పీసీఎన్ ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన నగరి బాలికల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇది వరకటిలాగే నిర్వహించాలని పెరుమాళుగుడి వీధికి చెందిన వారు ఎంఈవో శ్రీదేవి, నమశ్శివాయంలకు వినతిపత్రం అందించారు. సోమవారం ఎమ్మార్పీ కార్యాలయానికి వెళ్లిన వారు 1933 నుంచి 90 సంవత్సరాల పాటు ఎంపీపీ బాలికల పాఠశాల పెరుమాళ్ గుడివీధిలో నిర్వహణలో ఉందన్నారు. ఈ ప్రాంతం వారు బస్టాండు సమీపం ఉన్న పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చావడి సర్కిల్, బేరివీధి సర్కిల్ అంటూ రోడ్డు దాటుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. దీంతో తల్లిదండ్రులు ఆ మార్గంలో పంపే సాహసం చేయలేక పోతున్నామన్నారు. వసతులు లేని సమయంలోనే తాము పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేవారమని ప్రస్తుతం నాడునేడు పథకంలో పాఠశాలలు ఆకర్షణీయంగా ఉన్నా ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సి వస్తోందన్నారు. 3,4,5 తరగతులను విలీనం చేసిన ప్రక్రియను రద్దుచేసి ఇది వరకటిలాగే పాఠశాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన బస్ సర్వీసు ప్రారంభం



ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండల పరిధిలో నూతన బస్ సర్వీసును సోమవారం ప్రారంభించారు. మండలంలోని అడవిబుదుగూరు నుంచి శివనందపురం వయా యానాదిపురం వరకు నడిచే బస్సు సర్వీసును కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మణిరత్నం సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో అనేక బస్సు సర్వీసులను ఆపేశారని ఆరోపించారు. చంద్రబాబు సీఎం అయ్యాక కుప్పం నియోజకవర్గం లో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునః ప్రారంభించడం జరిగిందని, ఇందువల్ల నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో సౌకర్యం ఏర్పడింది అన్నారు. నియోజక వర్గ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. నూతనంగా ప్రారంభమైన బస్ సర్వీసు లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొండ మల్లేశ్వరునికి విశేష పూజలు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ అరుణ గిరిపై వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు స్వామివారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. తిరుపతికి చెందిన ఉషా రెడ్డి, శ్రీహరి రెడ్డిలు స్వామి వారిని దర్శించుకుని ఆలయానికి కావల్సి సరుకులు అందజేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి: ఎంపీడీవో

ప్రజాశక్తి-గంగవరం: గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. సోమవారం కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్యం లోపించిన చోట వెనువెంటనే చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. విద్యుత్ దీపాల్లో మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంటే వెంటనే చేయించాలన్నారు.

మోటారుకు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని శివాలయం వద్దనున్న తాగునీటి బోరు మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో అక్కడి ప్రజలు నీటి సమస్య ఏర్పడింది. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేశారు. కాగా ఈ నెల 9న ప్రజాశక్తిలో 'మోటారు ఇక అంతేనా సారు'అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వెంటనే సిబ్బందిని పురమాయించి మోటారుకు మరమ్మతులు చేపట్టారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కుమార్ మోటారు ఏర్పాటు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. సమస్య తీరడంతో పలువురు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలోని రక్షిత మంచినీటి సరఫరా బోరు నుంచి గ్రామానికి సరఫరా అయ్యే పైపులైన్లు పాడైపోవడంతో పంచాయతీ కార్యదర్శి మేనక ఆధ్వర్యంలో నూతన పైప్ లైన్‌లను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ చాలా ఏళ్ల క్రితం వేసిన పివిసి పైపులు రంధ్రాలు పడి నీరు వృధాగా పోతుండడంతో కొత్త పైపులు తీసుకువచ్చి పాత పైపులు తొలగించినట్లు వివరించారు. నీటి వృధా అరికట్టడమే కాకుండా ప్రజలకు అందరికీ తాగునీరు అందే సౌకర్యం ఏర్పడిందని తెలిపారు.

ఐదు నెలల బకాయిలు చెల్లించాలి

- ఉపాధి భద్రత కల్పించాలి
- గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ డిమాండు

పజాశక్తి- సత్యవేడు: మండలంలో గ్రీన్ అంబాసిడర్లకు 45 నెలలుగా అందించాల్సిన బకాయి జీతాలు వెంటనే చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండు చేశారు. సత్యవేడు మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు ఉద్యోగ భద్రత, ప్రభుత్వం చెల్లించవలసిన 45 నెలల బకాయి జీతాలపై సత్యవేడు మండల సిఐటియు అధ్యక్షులు మెలుగు రమేష్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి మునస్వామి మాట్లాడుతూ 2017 సంవత్సరం స్వచ్ఛభారత్‌లో గ్రీన్ అంబాసిడర్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల పారిశుధ్యం కోసం వర్కర్స్ ను ఏర్పాటు చేసి వారికి వేతనం 6 వేలుగా అప్పటి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నియమించాయి. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల జీతాలు సజావుగా చెల్లిస్తూ వచ్చారని, 2019 ఎన్నికలలో గెలుపొందిన కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు 45 నెలలుగా తమకు జీతాలు అందక బకాయి పడ్డారన్నారు. ఎలాంటి ఉద్యోగ భద్రత చర్యలు చేపట్టలేదని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వం జీతాలు చెల్లించినప్పటికీ గ్రామాలలోని పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను అడ్డుపెట్టి పారిశుధ్య పనులను నిర్విరామంగా చేసినప్పటికీ అప్పటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించకుండా సన్మానానికి మాత్రమే పరిమితం చేశారని తెలిపారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి దోహదపడే బకాయి జీతాలు చెల్లింపు,ఉద్యోగ భద్రత, పని ఉపకరణాలు అందించకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. ఈ జీతాలు చెల్లింపు, ఉద్యోగ భద్రత విషయమై స్థానిక ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీ, ఎమ్మెల్యేని, ఎంపీల వద్ద అనేకమార్లు భిక్షాటన చేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ విషయమై అనేకమార్లు నిరసనలు, ధర్నాలు చేసినా అప్పటి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి కానీ, సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి కానీ ఎలాంటి స్పందన లేక పోవడం పారిశుధ్య కార్మికుల జీవనాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందులో అధిక సంఖ్యాకులుగా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు కావడం, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు మోయరాని పెను భారంగా మారిందని పేర్కొన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యమో లేదా పార్టీల మధ్య వైషమ్యమో గ్రీన్ అంబాసిడర్ల జీవితాలు దుర్భర స్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 సంవత్సరం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభిం చిన స్వచ్ఛ భారత్ గ్రామీణ పథకం కనుక గ్రీన్ అంబాసిడర్ల గోడును ముఖ్యమంత్రి పట్టించుకుని వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆగిన 45 నెలల జీతాలను చెల్లించి, ఉద్యోగ భద్రతను కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు సత్యవేడు మండల అధ్యక్షులు మెలుగు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించి ఉపాధి భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునస్వామి శేఖర్,సుబ్రహ్మణ్యం, చంద్రబాబు, రాజేంద్రన్, మారి, కిస్టన్, వేలయ్య పాల్గొన్నారు

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81చిన్న ఉప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ చిత్ర వస్త్రాన్ని ధ్వజస్తంభానికి కట్టి పూజలు నిర్వహించారు. రాత్రి 9గంటల పైన చిన్న శేష వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. స్వామి వారి రాక సందర్భంగా భక్తులు కర్పూర హారతులు అందజేశారు.



క్రైం కార్నర్

విద్యుదాఘాతానికి మహిళ మృతి



ప్రజాశక్తి-వికోట: మండలంలోని కె.పి.బండ గ్రామ సమీపంలోని మామిడి తోపుకు వేసిన ఇనుప ముళ్ళ కంచె వైపు ప్రవేశించిన ఆసిఫా(35) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. కేపి బండ గ్రామానికి ఓ రైతు మామిడి తోటలో ఏర్పాటు చేసిన ఇనుప కంచెకు విద్యుత్ వైర్లు తగిలాయి. గుర్తించకుండా అటుగా ప్రవేశించిన ఆసిఫా విద్యుత్ షాక్‌కు గురైంది. సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. ఈ ఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు సమీపంలో నిమ్మనపల్లి మార్గంలో సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. మృతుడు నిమ్మనపల్లి మండలం కత్తిరోళ్లపల్లికి చెందిన చైతన్య కుమార్(22)గా గుర్తించినట్లు సంఘటనా స్థలం వద్ద ఉన్నవారు సోమవారం మధ్యాహ్నం తెలిపారు. చైతన్య కుమార్ అమ్మమ్మ ఊరు అయిన సదుం మండలంలోని పచ్చార్ల జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా సోమల మండలం కందూరు గ్రామపంచాయతీ తప్పన్నగారిపల్లి మలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలుస్తోంది. కాగా సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేగ దూడను చంపిన చిరుత

ప్రజాశక్తి-పలమనేరు: మండలంలోని నల్లగాం పల్లి, ఎర్రపెంట ప్రాంతంలో లేగ దూడపై చిరుత పులి దాడి చంపిందని స్థానికులు తెలిపారు. గోవిందరాజులు అనే రైతుకు చెందిన ఒక లేగ దూడను చంపి తిరిగి మళ్లీ అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. చిరుత సంచారంపై స్థానికులు భయందోళనకు గురవుతున్నారు.